www.ninadam.in

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

EVENING 6 PM డిజిటల్ ఎడిషన్

శుక్రవారం ఏప్రిల్ 17 2026 ninadam.in



## ఢిల్లీలో రేవంత్ రెడ్డితో టీడీపీ మహిళా నేతల భేటీ..

### - రాజకీయ వర్గాల్లో ఆసక్తి!

- ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసిన పరిటాల సునీత, ఇతర నేతలు
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల సందర్భంగా ఈ సమావేశం
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన భేటీ ఫోటోలు
- భిన్న రాజకీయ కూటముల నేతల కలయికపై చర్చ

**ఢిల్లీ, ఏప్రిల్ 17 (నినాదం):**

దేశ రాజధాని ఢిల్లీలో ఒక ఆసక్తికర రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యే పరిటాల సునీత సహా పలువురు మహిళా ఎంపీలు, ఎమ్మెల్యేలు

2 లో



## ధాన్యం సేకరణ కోసం కేంద్రమంత్రిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి

- 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలని విజ్ఞప్తి
- రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులపై చర్చ

**ఢిల్లీ, ఏప్రిల్ 17 (నినాదం):**

కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,

2 లో

## మీ ఆత్మ ప్రబోధానుసారం నడుచుకోండి

### - పార్లమెంటు సభ్యులకు ప్రధాని మోదీ పిలుపు


- లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లు
- ఇది యుగాలుగా మహిళలకు నిరాకరించిన హక్కు అని, వారికి న్యాయం చేయాలని వ్యాఖ్య
- డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని ప్రధాని హామీ
- శుక్రవారం సాయంత్రం లోక్‌సభలో బిల్లుపై ఓటింగ్ జరిగే అవకాశం

మహిళా రిజర్వేషన్ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించాలని ఎంపీలకు ప్రధాని మోదీ పిలుపు



**ఢిల్లీ, ఏప్రిల్ 17 (నినాదం):**
పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ఈ చరిత్రాత్మక బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి చరిత్ర సృష్టించాలని ఆయన పార్లమెంటు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఇది దేశంలోని సగం జనాభా అయిన మహిళలకు దక్కాల్సిన హక్కు అని, వారి శక్తికి కొత్త అవకాశాలు కల్పించాలని కోరారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీ శక్తి వందన్ అధినియమ్' అమలు కోసం ప్రభుత్వం

2 లో



## అమలులోకి వచ్చిన 'మహిళా రిజర్వేషన్ యాక్ట్'..

### గురువారం అర్ధరాత్రి నోటిఫికేషన్

- రిజర్వేషన్లు మాత్రం 2029 ఎన్నికల్లోనే అంటున్న విశ్లేషకులు
- 2023 లోనే పార్లమెంట్ ఆమోదంతో చట్టంగా మారిన బిల్లు
- ఏప్రిల్ 16 నుంచి అమల్లోకి వచ్చినట్లు కేంద్రం నోటిఫికేషన్



## తేజస్వీ వ్యాఖ్యలను తొలగించేలా చేయండి

- కిషన్ రెడ్డిని కోరిన మంత్రి పొన్నం
- లోక్‌సభలో మాట్లాడిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోలేం
- మంత్రి పొన్నం లేఖపై డిజిపి శివధర్ రెడ్డి స్పష్టీకరణ

2 లో



## 'ఇది శిక్షా?' అంటూ డీలిమిటేషన్‌పై శశి థరూర్ ధ్వజం

- జనాభా నియంత్రణలో విఫలమైన రాష్ట్రాలకు రివార్డు
- సమర్థంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు శిక్ష
- డీలిమిటేషన్ ఓ రాజకీయ ఉచ్చు అంటూ సంచలన వ్యాఖ్యలు

2 లో



## రాజ్యసభ డిప్యూటి చైర్మన్‌గా మరోమారు హరివంశ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 (నినాదం):**
రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ ఎన్నికయ్యారు. ప్రతిపక్ష అభ్యర్థులు ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఆయన ఉపసభాపతి బాధ్యతలు చేపట్టడం ఇది మూడోసారి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ డిప్యూటీ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన

2 లో



## శాస్త్రిపురం ఫ్లై ఓవర్ ప్రారంభం

### ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 17 (నినాదం):**
హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలక అడుగుపడింది. నగరంలో మరో ఆర్‌వోబీ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం శాస్త్రిపురం రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌ను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ 71 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. సుమారు 490 మీటర్ల పొడవుతో, నాలుగు లైన్లలో ఫ్లై ఓవర్ జీహెచ్ఎంసీ నిర్మించింది. జీహెచ్ఎంసీ, సౌత్ సెంట్రల్ రైల్వేల సమన్వయంతో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. శాస్త్రిపురం ఫ్లై ఓవర్ అందుబాటులోకి

2 లో

## తేజస్వీ సూర్య మాటల్లో తప్పేముంది

### మంత్రి పొన్నం వ్యాఖ్యలపై బండి మండిపాటు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 (నినాదం):**
తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాటలను కాంగ్రెస్ నేతలు ఎందుకు తప్పుబడుతున్నారంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. రాష్ట విభజన సమయంలో కాంగ్రెస్ తప్పిదాలతో పలువురు యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని ఎంపీ తేజస్వి సూర్య చెప్పారని తెలిపారు. 2009లో కాంగ్రెస్ తెలంగాణ ఏర్పాటుకు సహకరించి మళ్లీ వెన్నక్కి తగ్గారని.. దీని గురించే తేజస్వి సూర్య మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి గతంలో సోనియాగాంధీని బలిదేవత

2 లో



## సిగాచీ బాధితులను నట్టేట ముంచారు

- కోటి పరిహారం హామీ ఇచ్చి మరచిన సిఎం
- మరోమారు మండిపడ్డ హరీష్ రావు



**హైదరాబాద్, ఏప్రిల్ 17 (నినాదం):**

సిగాచి ప్రమాద బాధితులకు ఇచ్చిన హామీని కూడా నిలుపుకోలేక తన అసమర్థతను సీఎం రేవంత్ రెడ్డి మరోసారి చాటుకున్నారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. నాడు కోటి రూపాయల సాయం అంటూ సిగాచి బాధితులను నమ్మబలికి అందులో సగం కూడా వారికి చేర్చని రేవంత్ రెడ్డి నయవంచనలో తనను మించినవారు లేరని నిరూపించుకున్నారని అన్నారు. ఆ పూటకు మాటలు చెప్పడం.. ఆ తర్వాత తాను చెప్పిన మాటలకే

2 లో

## రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా

- ఉత్తరాది, దక్షిణాది పేరుతో విషం చిమ్ముతున్నారు
- కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి

**న్యూఢిలలీ, ఏప్రిల్ 17 (నినాదం):**

దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గకుండా డీలిమిటేషన్ పక్రియ జరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కొత్త నాయకత్వానికి అవకాశం వస్తుందని ప్రతిపక్షాలు డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్ల పెంపు నిర్ణయం తీసుకుంటే.. తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని మండిపడ్డారు. మహిళల

2 లో





## ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలను ప్రభుత్వం నట్టేట ముంచింది

- ఆరు నెలల్లోగా పీఆర్సీ అమలుచేస్తామన్న హామీ ఏమైందని ప్రభుత్వానికి కవిత ప్రశ్న
- పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్న వాగ్దానాన్ని గాలికి వదిలేశారని విమర్శ
- రిటైర్మెంట్ బకాయిల కోసం వృద్ధాప్యంలో ఉద్యోగులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన

**హైదరాబాద్, ఏప్రిల్ 17 (నినాదం):**

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల దాడిని కల్వకుంట్ల కవిత మరింత ఉద్ధృతం చేశారు. ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక

2 లో

## ఏపీకి 15-శాతం వృద్ధి లక్ష్యం..

- రాష్ట్రానికి 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశం
- ప్రజలపై భారం లేకుండా ఆదాయం పెంచాలని అధికారులకు సూచన
- గత ప్రభుత్వ నిర్ణయాల విద్యుత్ భారాన్ని మోస్తున్నామన్న చంద్రబాబు
- అమరావతి, పోలవరం పూర్తయితే సంపద సృష్టి జరుగుతుందని వెల్లడి
- ఎన్ని ఇబ్బందులున్నా 269 అన్న క్యాంటీన్లను నడుపుతున్నామని స్పష్టీకరణ

**అమరావతి, ఏప్రిల్ 17 (నినాదం) :**

రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో 15 శాతం వృద్ధి రేటును సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీనికి అనుగుణంగా మైక్రో, మ్యాక్రో స్థాయిల్లో స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఆర్థిక శాఖ పనితీరుపై ఆయన



సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో నీరు,

2 లో

## శ్రీవాణి నిధులతో 5000 ఆలయాలు..

### రెండేళ్లలో పూర్తికి ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశం

- ఆలయాల్లో తిరుమల తరహాలో అన్నప్రసాద వితరణ చేయాలన్న సీఎం
- దేవాదాయ భూముల రక్షణకు బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ వినియోగించాలని ఆదేశం
- రాష్ట్రంలోని 22 ప్రముఖ దేవాలయాలకు మాస్టర్ ప్లాన్లు రూపొందించాలని సూచన

నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
EVENING 6PM
02
డిజిటల్ ఎడిషన్
శుక్రవారం ఏప్రిల్ 17 2026
ninadam.in

## శాస్త్రిపురం ఫ్లై ఓవర్ ప్రారంభం

రావడంతో మైలార్ దేవ్‌పల్లి నుంచి ఫలక్‌నుమా మార్గంలో ప్రయాణం సులభతరం అయింది. ఉద్దమ్‌గడ్డ రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఏర్పడే ట్రాఫిక్ జామ్‌కు చెక్ పడనుంది. ప్రయాణ సమయం కూడా చాలా వరకు తగ్గనుంది. ఈ ÷÷-లఓల్గ÷వర్ ద్వారా మైలార్‌దేవ్‌పల్లి, వట్టెపల్లి, ఫలక్‌నుమా, ఆర్టీసీ బస్ డిపో ప్రాంతాల మధ్య కనెక్టివిటీ మెరుగుపడింది.

## తేజస్వీ సూర్య మాటల్లో తప్పేముంది

అన్నారన్న విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అంటూ విమర్శించారు. అలాంటి రేవంత్ కుఏబినేట్‌లో ఉన్న పొన్నం తదితరులు గతాన్ని మరిచి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో రణభేరి కార్యక్రమానికి రేవంత్ రెడ్డి తుపాకీ పట్టుకొని వెళ్లారని కేంద్ర మంత్రి తెలిపారు. 1400 మంది బలిదానాలకు హత్యలకు కారణమైన పార్టీ కాంగ్రెస్ అని ఆరోపించారు. ఒక్క ఓటు, రెండు రాష్ట్రాలు అనే నినాదానికి కట్టుబడి, రాష్ట్ర విభజనకు మద్దతు ఇచ్చింది బీజేపీ అని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ కావాలని అడ్డుకుంటోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ అవినీతి గురించి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలను ప్రభుత్వం నట్టేట ముంచింది

వర్గాలను ప్రస్తుత ప్రభుత్వం నట్టేట ముంచిందని ఆమె ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన కవిత, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రభుత్వం నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. ఆరు నెలల్లోగా పీఆర్సీ అమలు చేస్తామన్న మాట ఏమైందని ప్రశ్నించిన ఆమె, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్న వాగ్దానాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రాథమిక అవసరాలైన హెల్త్ స్కీం, వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్ వంటి అంశాల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతోందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రిటైర్మెంట్ బకాయిల కోసం వృద్ధాప్యంలో ఉద్యోగులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఐదు వాయిదాల కరవు భత్యం ఊసే లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ఠ అని ఆమె ధ్వజమెత్తారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు నేడు రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు చేపట్టే నిరసన ప్రదర్శనలకు తెలంగాణ జాగృతి తరపున తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆమె ప్రకటించారు. న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు తాము అండగా ఉంటామని స్పష్టం చేస్తూ, ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరి వీడి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## ధాన్యం సేకరణ కోసంకేంద్రమంత్రిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. వానాకాలం యాసంగి పంటకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలని వారు కేంద్రమంత్రిని కోరారు. 2025-26 సీజన్ కు గాను యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రికి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ధాన్యం సేకరణ, కేంద్ర ప్రభుత్వం వాటా సంబంధిత అంశాలపై కేంద్రమంత్రితో వారు చర్చించారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులను మంజూరు చేయాలని వారు కోరారు.

# సిగాచీ బాధితులను నట్టేట ముంచారు

విలువ ఇవ్వకపోవడం రేవంత్ రెడ్డికే చెల్లిందని విమర్శించారు. సిగాచి పరిశ్రమ అగ్నిప్రమాదంలో 54 మంది అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోతే, ఆ బాధితుల కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు వివేక్, దామోదర రాజనర్సింహ.. మృతదేహాల సాక్షిగా ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించారని తెలిపారు. కానీ ఇదంతా కంటితుడుపు చర్యే అని, బాధితులకు జరిగిన న్యాయం శూన్యమని ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంతో తేటతెల్లమైందని పేర్కొన్నారు. యాజమాన్యం, ప్రభుత్వం కుమ్మక్కై పరిహారం లెక్కల్లో చేస్తున్న మోసం అంతా ఇంతా కాదని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం అసెంబ్లీలో సమర్పించిన అధికారిక లెక్కల ప్రకారం, 54 మంది బాధితులకు కలిపి ఇప్పటివరకు చెల్లించిన రూ. 24.51 కోట్లను విభజించి చూస్తే, ఒక్కో కార్మికుడి కుటుంబానికి సగటున అందిన పరిహారం కేవలం రూ. 45.40 లక్షలు మాత్రమే అని తెలిపారు. అంటే ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన కోటి రూపాయల పరిహారంలో ఇంకా ఒక్కో కుటుంబానికి దాదాపు రూ. 54.60 లక్షల చొప్పున, మొత్తంగా రూ. 29.48 కోట్ల బకాయిని ఈ ప్రభుత్వం ఎగ్గొట్టి బాధితులను నట్టేట ముంచిందని మండిపడ్డారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ పేద బాధిత కుటుంబాలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఇక్కడ మరో మోసం దాగుందని విమర్శించారు. యాజమాన్యం తాము 40 నుంచి 42 లక్షలు ఇస్తున్నామని కోర్టుల ముందు ఒప్పుకుందని చెప్పారు. అసలు నిజమేంటంటే, వారు సొంతంగా ఇచ్చిన 25 లక్షలకు.. కార్మికులు చనిపోవడం వల్ల చట్టబద్ధంగా వారికి రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులను కూడా కలుపుకుని ఈ లెక్కలు చూపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, యాజమాన్య అమానవీయతకు, దిగజారుడుతనానికి పరాకాష్ట అని మండిపడ్డారు. అంతేకాదు, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన కార్మికుల వైద్య ఖర్చులను కూడా ఈ అరకొర పరిహారంలోనే కోత విధించడం దారుణమని అన్నారు. ఇక ప్రమాదంలో కాలి బూడిదై ఆచూకీ దొరకని 8 మంది కార్మికుల కుటుంబాలను డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పించుకున్న దుర్మార్గ ప్రభుత్వం ఇది అని విమర్శించారు. ఇది కేవలం ఒక ప్రమాదం కాదు, యాజమాన్యం నిర్లక్ష్యంతో జరిగిన సామూహిక హత్య అని హరీశ్‌రావు అన్నారు. ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాలు గాలికొదిలేశారని విచారణలో ఆధారాలతో సహా స్పష్టంగా తేలిందని చెప్పారు. బాధితుల పక్షాన హైకోర్టులో కేసు వేసి, న్యాయస్థానం మొట్టికాయలు వేస్తే తప్ప పోలీసులు కదలలేదని హరీశ్‌రావు తెలిపారు. తూతూ మంత్రంగా ఎండీని అరెస్టు చేయడం, వెంటనే ఆయన బెయిల్ మీద బయటకు వచ్చేలా పరోక్షంగా సహకరించడం చూస్తుంటే.. ప్రభుత్వానికి, కంపెనీ యాజమాన్యానికి మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాలు ఏమిటో అర్థం అవుతూనే ఉందన్నారు. ఆనాడు మృతదేహాల సాక్షిగా ఇచ్చిన మాట ప్రకారం, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులతో సంబంధం లేకుండా ప్రతి బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# మీ ఆత్మ ప్రబోధానుసారం నడుచుకోండి



ఈ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తోంది. ఈ బిల్లును 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి అమలు చేయడమే లక్ష్యంగా అవసరమైన రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. భవిష్యత్తులో జనాభా గణన, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) తర్వాత ఈ రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, “దయచేసి మీ మనస్సాక్షి చెప్పినట్టు నడుచుకోండి. మీ కుటుంబంలోని మహిళలను గుర్తుచేసుకోండి. ఇది మహిళలకు మనం ఇస్తున్నాం అనుకోకండి... యుగాలుగా వారికి నిరాకరించబడిన హక్కును తిరిగి ఇవ్వడం మన బాధ్యత అని గుర్తించండి“ అని పేర్కొన్నారు. ఈ బిల్లు ఆమోదం ఘనతను ప్రతిపక్షాలే తీసుకోవచ్చని, తనకు క్రెడిట్ అవసరం లేదని స్పష్టం చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని ప్రధాని స్పష్టమైన హామీ ఇచ్చారు. ప్రస్తుతం లోక్‌సభలో ఈ బిల్లులపై చర్చ కొనసాగుతుండగా, శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. ఈ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందితే దేశ ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని ప్రధాని పేర్కొన్నారు.

### అమలులోకి వచ్చిన 'మహిళా రిజర్వేషన్ యాక్ట్'..

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చారిత్రక మహిళా రిజర్వేషన్ చట్టం 2026 ఏప్రిల్ 16 నుంచి అమల్లోకి వచ్చింది. వాస్తవానికి కేంద్రం తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంట్ 2023లోనే ఆమోదముద్ర పడింది. మూడేళ్ల కిందటే చట్టంగా మారింది. అయితే, ఈ చట్టాన్ని గురువారం (ఏప్రిల్ 16) నుంచి అమలులోకి తీసుకొచ్చినట్లు కేంద్రం పేర్కొంది. ఈ మేరకు గురువారం రాత్రి అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ చట్టాన్ని 2029 సాధారణ ఎన్నికల నాటికే అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఇందుకోసం పార్లమెంటులో కొత్త రాజ్యాంగ సవరణ బిల్లును (131వ) ప్రవేశపెట్టింది. 2023లో ఆమోదించిన చట్టం ప్రకారం.. కొత్త జనగణన, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) తర్వాతే లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళా రిజర్వేషన్లు అమలు కావాల్సి ఉంది. అయితే, ఈ ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశం ఉండటంతో.. జనగణన, డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా (డీలింకింగ్) రిజర్వేషన్లను అమలు చేయాలని తాజా బిల్లులో ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనిపై ప్రస్తుతం పార్లమెంటులో చర్చ జరుగుతోంది. కొత్త ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ స్థానాలను ప్రస్తుతమున్న 543 నుంచి 816కి పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. 2027లో జరగబోయే జనగణన కోసం ఆగకుండా, 2011 జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, ఈ పునర్విభజన వల్ల జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభలో సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఆందోళనలపై పార్లమెంటులో స్పందించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని, ఎవరి సీట్లు తగ్గవని హామీ ఇచ్చారు. మహిళా సాధికారతకు ఇది పెద్ద ముందడుగు అని ప్రభుత్వం చెబుతుండగా, దీని అమలు వెనుక రాజకీయ వ్యూహాలు ఉన్నాయని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

# ఏపీకి 15-శాతం వృద్ధి లక్ష్యం..

విద్యుత్ లాంటి వనరుల్ని వ్యవసాయానికి, పరిశ్రమలకు అవసరమైనంత మేరకు అందిస్తున్నామని.. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉత్పాదకత పెంపు దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులు ఉన్నా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని.. అలాగే గత పాలకుల నిర్ణయాల కారణంగా తలెత్తిన రూ.4600 కోట్ల విద్యుత్ భారాన్ని కూడా కూటమి ప్రభుత్వమే భరిస్తోందని అన్నారు. ప్రజలపై ఎలాంటి భారం లేకుండా ఆదాయార్జన శాఖలు రెవెన్యూ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అమరావతి, పోలవరం సహా రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులు పూర్తి అయితే సంపద సృష్టికి అవకాశాలు ఏర్పడతాయని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రాధాన్యతా ప్రాజెక్టులకు ఎలాంటి నిధుల కొరతా లేదని కేంద్ర సహకారంతో వాటిని పూర్తి చేసి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. పూర్వోదయ, సాస్కి లాంటి వివిధ కేంద్ర పథకాల ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులు వేగవంతం కావాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. సంక్షేమ క్యాలెండర్‌కు అనుగుణంగానే పథకాలను అమలు చేస్తామని సీఎం అన్నారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధులపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను గత పాలకులు నిర్దయగా మూసివేశారని.. ఎన్ని ఇబ్బందులు ఉన్నా అన్నార్తుల కడుపు నింపేలా రాష్ట్రవ్యాప్తంగా 269 క్యాంటీన్లలో భోజనం పెడుతున్నామని అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలలో సామర్ధ్యంతో పాటు సులభతరమైన విధానాల ద్వారా పెట్టుబడులు, ఆదాయాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, సీఎస్ సాయి ప్రసాద్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## శ్రీవాణి నిధులతో 5000 ఆలయాలు..

రాష్ట్రవ్యాప్తంగా శ్రీవాణి నిధుల వినియోగంతో 5 వేల దేవాలయాలను రాబోయే రెండేళ్లలో పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ ఆలయాల నిర్మాణ పనుల పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఒక రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. గురువారం సచివాలయంలో దేవాదాయ శాఖపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..” శ్రీవాణి నిధులతో రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలు నిర్మించాలని గతంలోనే నిర్ణయించాం. ఈ ఆలయాల నిర్మాణ బాధ్యత జిల్లా యంత్రాంగానికి అప్పగించాలని ఆలోచన చేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో నియోజకవర్గంలో 25-30 వరకూ ఆలయాలను నిర్మించే అవకాశం ఉంటుంది. స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ఆలయాల నిర్మాణాన్ని చేపట్టాలి. వారి నుంచి ప్రతిపాదనలు తీసుకుని నిర్మాణం చేపట్టండి. ఆలయాల నిర్మాణానికి సంబంధించి మూడు రకాల డిజైన్లతో పైలెట్ ప్రాజెక్టుగా నిర్మించాలి. వీటి నిర్మాణానికి సంబంధించి త్వరితగతిన అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. ప్రతీ దేవాలయానికీ ప్రహరీ నిర్మాణం చేపట్టాలి. ”అని సీఎం స్పష్టం చేశారు.

పవిత్రతతో పాటు పారిశుద్ధ్యమూ ముఖ్యం

“రాష్ట్రంలోని 22 ప్రముఖ దేవాలయాలకు మాస్టర్ ప్లాన్లు రూపొందించాలి. ఇప్పటి వరకు సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, పెనుగంచిప్రోలు, శ్రీకాళహస్తి, కాణిపాకం దేవాలయాలకు మాస్టర్ ప్లాన్లు సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన దేవాలయాలకు కూడా మాస్టర్ ప్లాన్‌లను త్వరితగతిన రూపొందించాలి. ఈ మాస్టర్ ప్లాన్ ల ద్వారా భక్తులకు మెరుగైన సదుపాయాలు, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, నివాస సౌకర్యాలు, పరిశుభ్రత వంటి అంశాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలి. దేవాలయాల్లో పవిత్రతో పాటు పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమివ్వాలి. దేవుణ్ణి దర్శించుకోవడానికి వచ్చే భక్తులు భక్తి భావంతో దర్శనం చేసుకునే వాతావరణం ఉండేలా చేయడంతో పాటు.. ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే భక్తులు సంతృప్తితో తిరిగి వెళ్తారు. గతంతో పోల్చుకుంటే రాష్ట్రంలోని దేవాలయాలకు భక్తుల సందర్శన పెద్ద ఎత్తున పెరుగుతోంది. ప్రధాన దేవాలయాల్లో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. 2025-26 సంవత్సరంలో శ్రీశైలం, విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయాల్లో 1.20 కోట్లకు పైగా భక్తులు దర్శించుకున్నారు. శ్రీకాళహస్తిలో 83.88 లక్షలు, సింహాచలంలో 65.48 లక్షలు, అన్నవరంలో 57.87 లక్షలు, ద్వారకా తిరుమలను 55.15 లక్షల మంది భక్తులు సందర్శించారు. దేవాలయాలకు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత దేవాదాయ శాఖపైనే ఉంది. భక్తులకు తాగు నీటి సౌకర్యం మొదలుకుని అన్నదానం వరకు అన్ని రకాల సేవలను అందించాలి.”అని ముఖ్యమంత్రి చెప్పారు.

తిరుమల తరహాలో అన్న ప్రసాద వితరణ చేపట్టాలి

“రాష్ట్రంలోని 111 దేవాలయాల్లో అన్న ప్రసాదాన్ని అందిస్తుంటే... 65 దేవాలయాల్లో నిత్యాన్నదానం అందిస్తున్నాం. తిరుమల తరహాలోనే ఇతర దేవాలయాల్లోనూ అన్న ప్రసాదం అందించాలి. ప్రస్తుతం రాష్ట్రంలోని దేవాలయాల్లో రోజుకు సుమారు 80 వేల మంది భక్తులకు అన్న ప్రసాదం అందుతోంది. దీని కోసం ఏడాదికి రూ. 157.85 కోట్లు వ్యయం అవుతోంది. ఆయా దేవాలయాల్లో పాకశాలల్లో పని చేసే వారికి శిక్షణ ఇప్పించాలి. దేవాలయాల అభివృద్ధికి కామన్ గుడ్ ఫండ్ ద్వారా జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. నిర్దిష్టమైన గడువులోగా సీజీఎఫ్ నిధులతో చేపట్టే దేవాలయాల నిర్మాణాలను పూర్తి చేయాలి. అన్ని ప్రధాన ఆలయాల్లో వాట్సాప్ ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకురావాలి. అన్ని రకాల సేవలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలి. అన్ని ఆలయాలకూ ప్రత్యేక వెబ్‌సైట్లు రూపొందించాలి. సమగ్ర వివరాలతో డ్యాష్‌బోర్డ్ కూడా అందుబాటులోకి తీసుకురావాలి. ఆగమ సలహా మండలి, ఎండోమెంట్ ట్రిబ్యునల్ చైర్మన్, స్టాండింగ్ కౌన్సిల్ నియామకాన్ని త్వరితగతిన చేపట్టండి. ఇంకా పెండింగులో ఉన్న దేవాలయాల పాలక మండళ్లను వెంటనే నియమించాలి.”అని సీఎం సూచించారు.

దేవాలయాల సమీప ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి

“ఆధ్యాత్మిక టూరిజం ప్రమోట్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. అన్ని దేవాలయాల వద్ద వసతి సౌకర్యాలు మెరుగవ్వాలి. ప్రముఖ దేవాలయాలు ఉన్న ప్రాంతాలన్నీ అభివృద్ధి జరిగేలా చూడాలి. దీని కోసం టెంపుల్ టౌన్ డెవలప్‌మెంట్ ప్లాన్ సిద్ధం చేయాలి. భక్తుల రద్దీ నియంత్రణ విషయంలో టీటీడీ అనుసరిస్తున్న విధానాన్ని అధ్యయనం చేయండి. కేవలం భద్రత ఆధారంగా కాకుండా సంప్రదాయం ప్రకారం దేవాలయాల్లో నిబంధనలు ఉండాలి. దేవాదాయ భూముల రక్షణకు బ్లాక్ చైన్ టెక్నాలజీని వినియోగించాలి. దేవాదాయ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి. ఈవోలు బదిలీపై వెళ్లే సమయంలో కొత్తగా వచ్చే అధికారులకు ముఖ్యమైన వివరాలను అందించి వెళ్లాలి” అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా

రిజర్వేషన్లకు ఎంఐఎం వ్యతిరేకం. ఈ అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను కలిపింది ఎంఐఎం పార్టీయే. సీఎం రేవంత్‌రెడ్డిది హైబ్రిడ్ ఫార్ములా కాదు.. అది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. విపక్షాలు రాజకీయ దురుద్దేశంతో, ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నాయని ఆయన మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును అడ్డుకోవాలనే తప్పుడు ఆలోచనతో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ అపోహలు సృష్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రతిపక్షాలు పార్లమెంట్ సాక్షిగా పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నాయని, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం వారి రాజకీయ ప్రయోజనాల కోసమేనని ధ్వజమెత్తారు. దక్షిణ భారతదేశానికి న్యాయం చెయ్యడమే మోదీ ఫార్ములా. న్యాయమా, అన్యాయమా అనే దానిపై చర్చకు సిద్ధమా? అసదుద్దీన్ హైబ్రిడ్ ఫార్ములా ఇది, రేవంత్ రెడ్డి ఫార్ములా కాదు. మజ్లిస్ పార్టీ మహిళ రిజర్వేషన్లకు వ్యతిరేకం. ఈ పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను కలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీకి లొంగిపోయి పనిచేస్తోంది. 360 మంది తెలంగాణ ఉద్యమకారులను అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపింది. తెలంగాణ చివరి దశ ఉద్యమంలో 1200 మంది ఆత్మ బలిదానం చేసుకున్నారు. పార్లమెంట్లో బిల్లు పెట్టినప్పుడు కాంగ్రెస్ ఎంపీలే కారం పొట్లాలు, పెప్పర్ స్ప్రేలు కొట్టారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన తన వ్యాఖ్యలు తప్పు అయ్యాయని ఒప్పుకున్నారు. మహిళ రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపు బిల్లును అడ్డుకునేవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారు. దక్షిణాది రాష్ట్రాలకు నరేంద్ర మోదీ న్యాయం చేస్తున్నారని అన్నారు.

# ఢిల్లీలో రేవంత్ రెడ్డితో టీడీపీ మహిళా నేతల భేటీ..

మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలను పరిటాల సునీత తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేయడంతో అవి వైరల్ అయ్యాయి. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాలపై చర్చించేందుకు ఏప్రిల్ 16 నుంచి 18 వరకు జరుగుతున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల కోసం వివిధ పార్టీల నేతలు ఢిల్లీకి చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పార్లమెంట్ ప్రాంగణంలో రేవంత్ రెడ్డి, టీడీపీ మహిళా ఎమ్మెల్యేల మధ్య ఈ సమావేశం జరిగినట్లు తెలుస్తోంది. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. ప్రస్తుతం టీడీపీ కేంద్రంలో ఎన్డీఏ కూటమిలో ప్రధాన భాగస్వామిగా ఉండగా, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమిలో కీలకపాత్ర పోషిస్తోంది. ఇలా భిన్న రాజకీయ ధ్రువాలకు చెందిన నేతలు కలవడం ప్రాధాన్యత సంతరించు కుంది. అయితే, రేవంత్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ ఫైర్ బ్రాండ్ ఎమ్మెల్యేగా కొనసాగిన నేపథ్యంలో పాత పరిచయాల కారణంగానే మర్యాదపూర్వక భేటీ అని భావిస్తున్నారు.

# తేజస్వీ వ్యాఖ్యలను తొలగించేలా చేయండి

**హైదరాబాద్, ఏప్రిల్ 17 (నినాదం) :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అవమానించే విధంగా భాజపా ఎంపీ తేజస్వీ సూర్య పార్లమెంట్‌లో మాట్లాడారని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం సరికాదన్నారు. తేజస్వీ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఇందుకు లోక్‌సభ స్పీకర్‌ను ఒప్పించాలని ఆయన కోరారు. ఎంపీ విషయంలో చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డికి మంత్రి లేఖ రాశారు. ఈ లేఖపై డీజీపీ స్పందించారు. చట్టసభల్లో మాట్లాడిన అంశాలపై చర్యలు తీసుకునే అధికారం పోలీసులకు ఉండదని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా తేజస్వి మాట్లాడుతుంటే బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు మౌనంగా ఉన్నారని మంత్రి మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్తాన్ విభజనతో పోల్చడం సరికాదన్నారు. ఎంపీపై చర్యలు తీసుకోవాలని డీజీపీ శివధర్‌రెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్‌పై చర్చలో ఎంపీ తేజస్వి సూర్య పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజనను ప్రస్తావిస్తూ.. బ్రిటీష్ వాళ్లు చేసిన భారత్- పాకిస్తాన్ విభజనకంటే దారుణంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరే చేశారంటూ ఎంపీ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి.

# 'ఇది శిక్షా?' అంటూ డీలిమిటేషన్‌పై శశి థరూర్ ధ్వజం


**ఢిల్లీ, ఏప్రిల్ 17 (నినాదం):** నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ లోక్‌సభలో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను రాజకీయంగా శిక్షిస్తూ, విఫలమైన రాష్ట్రాలకు బహుమతి ఇవ్వడమే డీలిమిటేషన్ ఉద్దేశమా? అని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు జనాభా నియంత్రణ కోసం కృషి చేసి, విజయం సాధించిన దక్షిణాది రాష్ట్రాలు ఇప్పుడు తమ ఎంపీ సీట్లను కోల్పోవడం ద్వారా శిక్ష అనుభవించాలా? అని థరూర్ ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో, జనాభాను అదుపు చేయడంలో వెనుకబడిన ఉత్తరాది రాష్ట్రాలకు అదనపు సీట్లు కేటాయించడం వారి వైఫల్యానికి రివార్డు ఇవ్వడం లాంటిదేనని ఆయన విమర్శించారు. ఈ ప్రక్రియ సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందని హెచ్చరించారు. మహిళా రిజర్వేషన్ల అమలును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని థరూర్ ఒక 'రాజకీయ ఉచ్చు'గా అభివర్ణించారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మహిళల ఆకాంక్షలను రాజకీయ ప్రయోజనాల కోసం తాకట్టు పెట్టారని, రిజర్వేషన్లను తక్షణమే ఎందుకు అమలు చేయలేరని నిలదీశారు. కేవలం జనాభానే ప్రాతిపదికగా తీసుకోకుండా విద్య, ఆరోగ్యం, ఆర్థికాభివృద్ధి వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని పునర్విభజన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య రాజకీయ సమతుల్యత దెబ్బతిని దేశ సమగ్రతకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు.

## రాజ్యసభ డిప్యూటి ఛైర్మన్‌గా మరోమారు హరివంశ్

అనుభవం రాజ్యసభకు ఎంతో అవసరమని అన్నారు. ఆయన అందరినీ కలుపుకుని వెళ్లాలని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. హరివంశ్ నేతృత్వంలో సభ మరింత శక్తిమంతం అవుతుందని అన్నారు. రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా నూతన ఉపసభాపతికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రతిపక్షానికి కూడా తగిన ప్రాధాన్యం ఇస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఆయన అందరి వాడని అన్నారు. ఇటీవల ఆయన రాజ్యసభ పదవీకాలం ముగిసింది. దీంతో ఆయనను రాష్ట్రపతి కోటాలో నామినేట్ చేశారు.

# మమతా బెనర్జీ పాదయాత్రలో అనూహ్య ఘటన..

## - దూసుకొచ్చిన యువకుడు



**కోల్‌కత్తా ఏప్రిల్ 17 (నినాదం) :** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఎన్నికల వేడి తారాస్థాయికి చేరిన వేళ, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పర్యటనలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. పటిష్ఠమైన భద్రతా వలయం మధ్య ఆమె ఎన్నికల ప్రచార పాదయాత్ర నిర్వహిస్తుండగా, ఊహించని విధంగా ఒక యువకుడు రక్షణ కవచాన్ని ఛేదించుకుని నేరుగా ఆమె వద్దకు దూసుకురావడంతో తీవ్ర కలకలం రేగింది. అభిమానులకు అభివాదం చేస్తూ దీదీ ముందుకు సాగుతున్న సమయంలో, జనం మధ్య నుంచి మెరుపు వేగంతో వచ్చిన ఆ యువకుడు ఒక్కసారిగా ఆమె కాళ్లు మొక్కే ప్రయత్నం చేశాడు. అకస్మాత్తుగా జరిగిన ఈ పరిణామంతో మమతా బెనర్జీ దిగ్భ్రాంతికి లోనయ్యారు. భద్రతా సిబ్బంది తేరుకునేలోపే ఆ యువకుడు ముఖ్యమంత్రికి అత్యంత సమీపంలోకి వచ్చేయడంతో అక్కడ ఉన్న వారంతా భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది అతడిని అడ్డుకుని పక్కకు లాగేశారు. గతంలో ఎన్నికల ప్రచార సమయంలో మమతా బెనర్జీ పలుమార్లు గాయపడిన చేదు అనుభవాలు ఉండటంతో, తాజా భద్రతా లోపం తృణమూల్ కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన నింపింది.

నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
శుక్రవారం ఏప్రిల్ 17 2026
ninadam.in
EVENING 6 PM
డిజిటల్ ఎడిషన్



# ఏపీలో పలువురు మున్సిపల్ కమిషనర్లకు స్థానచలనం

- మొత్తం 17 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- నరసరావుపేట, కర్నూలుకు కొత్త మున్సిపల్ కమిషనర్లు
- విశాఖ, గుంటూరు కార్పొరేషన్లలోనూ కీలక మార్పులు

**అమరావతి, ఏప్రిల్ 17 (నినాదం) :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మున్సిపల్ పరిపాలన శాఖలో భారీగా మార్పులు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న 17 మంది అధికారులను బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు (జీవో ఆర్టీ నెం. 414) జారీ చేసింది. పరిపాలనాపరమైన కారణాలతో ఈ బదిలీలు చేపట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. ఈ బదిలీల్లో భాగంగా పలువురు కీలక అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్గా ఉన్న బి. రమ్య కీర్తనను నరసరావుపేట మున్సిపల్ కమిషనర్గా నియమించారు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (దక్షిణం) జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడిని గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్గా బదిలీ చేశారు. గుంటూరు అదనపు కమిషనర్గా ఉన్న సిహెచ్. ఓబులేసును కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్గా నియమించారు. ప్రస్తుత కర్నూలు కమిషనర్ విశ్వనాథ్ను బదిలీ చేసి, తదుపరి పోస్టింగ్ కోసం మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్కు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్గా ఉన్న జె. రామారావును తెనాలి అసిస్టెంట్ కమిషనర్గా బదిలీ చేశారు. పులివెందుల మున్సిపాలిటీకి ఇన్ఛార్జ్ కమిషనర్గా ఉన్న సి. ముని కుమార్ను అక్కడే రెగ్యులర్ కమిషనర్గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. చాలాకాలంగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కొందరు అధికారులకు ఈ బదిలీల్లో స్థానం కల్పించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ ఈ ఉత్తర్వులను జారీ చేశారు.

# యూరప్ పర్యటనకు జగన్కు గ్రీన్ సిగ్నల్

## - 25 రోజుల విదేశీ యాత్రకు సీబీఐ కోర్టు అనుమతి

- యూకేతో పాటు యూరప్ దేశాల్లో పర్యటించనున్న జగన్
- కుటుంబంతో కలిసి 25 రోజుల పాటు విదేశీ పర్యటన
- పర్యటన వివరాలు, కాంటాక్ట్ నెంబర్లు సీబీఐకి ఇవ్వాలని కోర్టు ఆదేశం



**అమరావతి, ఏప్రిల్ 17 (నినాదం) :**

వైసీపీ అధినేత జగన్ మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. తన కుటుంబ సభ్యులతో కలిసి యూకేతో పాటు యూరప్లోని పలు దేశాలను సందర్శించేందుకు అనుమతి కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్పై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది. ఈ నెల 20వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు, అంటే మొత్తం 25 రోజుల పాటు విదేశాల్లో గడిపేందుకు కోర్టు ఆయనకు అనుమతి మంజూరు చేసింది. అక్రమాస్తుల కేసు విచారణలో ఉన్న నేపథ్యంలో, విదేశీ ప్రయాణాలకు కోర్టు అనుమతి తప్పనిసరి కావడంతో జగన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఈ విదేశీ పర్యటనకు సంబంధించి న్యాయస్థానం కొన్ని కఠినమైన షరతులను విధించింది. ప్రయాణానికి ముందే తన పూర్తి పర్యటన వివరాలు, కాంటాక్ట్ నెంబర్లు, ఈ-మెయిల్ ఐడీ, అవసరమైన ష్యూరిటీ వివరాలను సీబీఐ అధికారులకు సమర్పించాలని ఆదేశించింది. ప్రస్తుతం ఏపీలో రాజకీయ సమీకరణాలు మారుతున్న తరుణంలో, జగన్ సుమారు మూడు వారాల పాటు విదేశీ పర్యటనకు వెళుతుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పర్యటన ముగించుకున్నాక, మే మధ్యలో ఆయన తిరిగి రాష్ట్రానికి చేరుకోనున్నారు.

# పాస్టర్ ఇంట్లో కట్టల కొద్దీ నోట్లు.. రూ. 2.27 కోట్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

- ఇది హవాలాకు సంబంధించిన డబ్బుగా అనుమానిస్తున్న అధికారులు
- హైదరాబాద్ నుంచి అల్లుడు డబ్బు తేవడంతో నిఘా పెట్టి పట్టుకున్న పోలీసులు
- డబ్బు ఎక్కడిదో చెప్పలేక తడబడిన పాస్టర్ కుటుంబం

**పశ్చిమ గోదావరి, ఏప్రిల్ 17 (నినాదం) :**



పశ్చిమ గోదావరి జిల్లాలో ఓ చర్చి పాస్టర్ ఇంట్లో భారీగా నోట్ల కట్టలు బయటపడటం కలకలం రేపింది. నరసాపురం మండలం పీచుపాలెంకు చెందిన పాస్టర్ ఘంటా జాన్బాబూరావు నివాసంలో పోలీసులు సోదాలు నిర్వహించి, ఎలాంటి ఆధారాలు లేని రూ. 2.27 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఈ డబ్బును సీజ్ చేసి, ఆదాయపు పన్ను (ఐటీ) శాఖకు సమాచారం అందించారు. ఇటీవల పాస్టర్ అల్లుడు శాంసన్ హైదరాబాద్ నుంచి రూ. 50 లక్షల నగదు తీసుకురావడంతో పోలీసులు నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన మామగారైన జాన్బాబూరావు ఇంట్లో తనిఖీలు చేపట్టగా, రూ. 500 నోట్ల కట్టల రూపంలో దాచి ఉంచిన ఈ భారీ మొత్తం బయటపడింది. ఇది హవాలా లావాదేవీలకు సంబంధించిన డబ్బు అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఒక పాస్టర్ ఇంట్లో ఇంత పెద్ద మొత్తంలో నగదు దొరకడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కాలంలో బాబూరావు కుటుంబం పెద్ద ఎత్తున ఆస్తులు కొనుగోలు చేసినట్లు, లక్షల్లో ఖర్చు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. పట్టుబడిన డబ్బు గురించి పోలీసులు ప్రశ్నించగా, కుటుంబ సభ్యులు పొంతనలేని సమాధానాలు చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ డబ్బు మూలాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళా బిల్లుకు టీడీపీ సంపూర్ణ మద్దతు

## - ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

**ఢిల్లీ, ఏప్రిల్ 17 (నినాదం):**



దేశాభివృద్ధిలో సగభాగంగా ఉన్న మహిళల చిరకాల స్వప్నం నెరవేరబోతోందని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన పాల్గొని, తమ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం అనేది కేవలం ఒక చట్టం మాత్రమే కాదని, అది కోట్లాది మంది మహిళల ఆకాంక్షలకు దక్కిన గౌరవమని ఆయన అభివర్ణించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో ఈ చారిత్రాత్మక బిల్లు అమలు కాబోతుండటం అభినందనీయమన్నారు. డీలిమిటేషన్ అంశంపై కూడా టీడీపీ తన స్పష్టమైన వైఖరిని చాటింది. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ఆందోళనలపై ఆయన క్లారిటీ ఇచ్చారు. లోక్‌సభ స్థానాల సంఖ్య పెరిగినప్పటికీ, రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తిలో మార్పు ఉండబోదని, దీనిపై ఇప్పటికే కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టత ఇచ్చారని గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు డీలిమిటేషన్ ఒక కీలక అడుగని, దీనివల్ల మహిళలతో పాటు యువతకు కూడా రాజకీయాల్లో కొత్త అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా సాధికారత కోసం ఎన్నో ఏళ్లుగా సాగుతున్న పోరాటాలకు ఈ బిల్లుతో ఒక తార్కిక ముగింపు లభిస్తుందని లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు.

# థాయ్‌లాండ్ నీళ్ల పండుగలో నెత్తుటి మరకలు.. 191 మంది మృతి

- థాయ్‌లాండ్‌లో 'సోంగ్‌క్రాన్' పండుగలో ఘోర విషాదం
- వారం రోజుల్లోనే 191 మంది మృతి.. 951కి పైగా ప్రమాదాలు
- అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడమే ప్రమాదాలకు ప్రధాన కారణం
- భారతీయ సంక్రాంతి పండుగతో సోంగ్‌క్రాన్‌కు ఉన్న సంబంధం
- ప్రభుత్వ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ కొనసాగుతున్న ప్రమాదాలు




**ఢిల్లీ, ఏప్రిల్ 17 (నినాదం):**

ప్రపంచంలోనే అతిపెద్ద వాటర్ ఫైట్‌గా ప్రసిద్ధి చెందిన థాయ్‌లాండ్ నూతన సంవత్సర వేడుక 'సోంగ్‌క్రాన్' ఈసారి తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పంట కోతల అనంతరం ఏప్రిల్ మధ్యలో జరుపుకునే ఈ పండుగ సంతోషం బదులు ఆందోళన నింపింది. వారం రోజులుగా జరుగుతున్న వేడుకల్లో ఇప్పటివరకు 191 మంది మరణించగా, 951కి పైగా రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రతి ఏటా సోంగ్‌క్రాన్ సందర్భంగా బ్యాంకాక్ వంటి ప్రధాన నగరాల్లోని లక్షలాది మంది ప్రజలు తమ సొంత గ్రామాలకు కుటుంబసభ్యులతో కలిసి వేడుకలు జరుపుకోవడానికి వెళతారు. ఈ క్రమంలో భారీగా పెరిగే ట్రాఫిక్ కారణంగా ప్రమాదాలు అధికంగా జరుగుతుంటాయి. ఈ ఏడు రోజుల కాలాన్ని "ఏడు ప్రమాదకరమైన రోజులు"గా స్థానికులు పిలుస్తారు. న్యూయార్క్ పోస్ట్ కథనం ప్రకారం ఈ ప్రమాదాల్లో 42 శాతం అతివేగం వల్ల జరగగా, 27.4 శాతం మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల సంభవించాయి. హెల్మెట్లు ధరించకపోవడం వంటి నిర్లక్ష్యపూరిత ప్రవర్తనలు కూడా మరణాలకు కారణమవుతున్నాయి. డిజాస్టర్ ప్రివెన్షన్ అండ్ మిటిగేషన్ విభాగం డేటా ప్రకారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నట్టు తేలింది. ప్రభుత్వం ఏటా భద్రతా ప్రచార కార్యక్రమాలు, కఠినమైన చట్టాలు అమలు చేస్తున్నప్పటికీ, ఈ మారణహోమం ఆగడం లేదు. అయితే, ఈ వేడుకల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఆదాయం సమకూరుతుంది. ఈ ఏడాది సుమారు 5 లక్షల మంది అంతర్జాతీయ పర్యాటకులు వస్తారని, దీని ద్వారా ప్రభుత్వానికి దాదాపు 940 మిలియన్ డాలర్ల ఆదాయం వస్తుందని అంచనా. సోంగ్‌క్రాన్ అనే పదం సంస్కృతంలోని 'సంక్రాంతి' నుంచి వచ్చింది. సూర్యుడు మేషరాశిలోకి ప్రవేశించడాన్ని ఇది సూచిస్తుంది. భారతదేశంలో జరుపుకునే మకర సంక్రాంతికి, ఈ పండుగకు మూలాలు ఒకటే. గతేడాది పాపాలను కడిగివేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలకడానికి నీటిని వాడటం ఇక్కడి ప్రధాన సంప్రదాయం. ఇంతటి సాంస్కృతిక ప్రాధాన్యం ఉన్న పండుగ ఏటా వందల మందిని బలి తీసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

## టీసీఎస్ కేసులో బిగ్ ట్విస్ట్..

# గర్భవతినంటూ ముందస్తు బెయిల్‌కు వెళ్లిన సూత్రధారి నిదా ఖాన్!

- టీసీఎస్ నాసిక్ కేసులో పరారీలో ఉన్న నిదా ఖాన్
- అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ముందస్తు బెయిల్ పిటిషన్
- కేసులో ఈమెను మాస్టర్‌మైండ్‌గా భావిస్తున్న పోలీసులు
- ఇప్పటికే ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసిన సిట్
- నేడు పిటిషన్‌పై విచారణ జరిపే అవకాశం




**ఢిల్లీ, ఏప్రిల్ 17 (నినాదం):**

దేశవ్యాప్తంగా కార్పొరేట్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నాసిక్ యూనిట్‌లోని బలవంతపు మత మార్పిడి, లైంగిక వేధింపుల కేసు అనూహ్య మలుపు తిరిగింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటూ, పోలీసుల కళ్లుగప్పి పరారీలో ఉన్న హెచ్ఆర్ మేనేజర్ నిదా ఖాన్ అరెస్ట్ భయంతో నాసిక్ జిల్లా కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. తాను గర్భవతినని, మానవతా దృక్పథంతో తనను అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పించాలని ఆమె తన పిటిషన్‌లో పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ కేసులో నిదా ఖాన్ పాత్ర అత్యంత కీలకమని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) భావిస్తోంది. బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు వారిని బెదిరించడం, నిందితులైన సీనియర్లకు కొమ్ము కాయడంలో ఆమెదే ప్రధాన పాత్ర అని ఆరోపణలున్నాయి. సిట్ బృందాలు ఆమె కోసం ముంబై, ఇతర ప్రాంతాల్లో ముమ్మరంగా గాలిస్తుండగానే, ఆమె న్యాయవాదుల ద్వారా ఈ పిటిషన్ దాఖలు చేయడం గమనార్హం.

**గర్భమే కీలక అస్త్రమా?**

ముందస్తు బెయిల్ కోసం నిదా ఖాన్ తన గర్భాన్ని ప్రధాన కారణంగా చూపడం ఈ కేసులో వ్యూహాత్మక ఎత్తుగడగా కనిపిస్తోంది. సాధారణంగా మహిళలు, అందులోనూ గర్భవతులు నిందితులుగా ఉన్నప్పుడు న్యాయస్థానాలు కాస్త సానుభూతితో వ్యవహరించే అవకాశం ఉంటుంది. అయితే, కేసు తీవ్రత, ఆమెపై ఉన్న ఆరోపణల దృష్ట్యా కోర్టు ఎలా స్పందిస్తుందనేది ఉత్కంఠగా మారింది. పోలీసులు ఆమెను 'మాస్టర్‌మైండ్'గా పరిగణిస్తున్న నేపథ్యంలో, కేవలం గర్భం అనే కారణంతో ఆమెకు ఉపశమనం లభిస్తుందా? లేదా? అనేది వేచి చూడాలి. ఈ పిటిషన్‌పై కోర్టు శుక్రవారం విచారణ చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**కేసు నేపథ్యం ఇదీ..**

టీసీఎస్ నాసిక్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న కొందరు సీనియర్లు, జూనియర్ మహిళా ఉద్యోగులను లైంగికంగా వేధించారని, హిందూ దేవుళ్లను కించపరుస్తూ మాట్లాడారని, బలవంతంగా బురఖా ధరించి నమాజ్ చేయాలంటూ ఒత్తిడి తెచ్చారని పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలపై మొత్తం 9 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, కేసు దర్యాప్తును సిట్ స్వీకరించింది. ఇప్పటివరకు ఈ కేసులో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులందరినీ టీసీఎస్ ఇప్పటికే సస్పెండ్ చేసింది. టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ ఆదేశాలతో కంపెనీ అంతర్గత విచారణ కూడా వేగంగా కొనసాగుతోంది. ఒకవైపు పోలీసుల గాలింపు, మరోవైపు న్యాయపోరాటంతో ఈ కేసు రోజురోజుకు మరింత ఉత్కంఠను రేపుతోంది.



# సింగరేణి ఉద్యోగుల మానవత్వం

**మంచిర్యాల, ఏప్రిల్ 17(నినాదం):**

శ్రీరాంపూర్ ఏరియా లో ఎస్.ఆర్.పి 3, 3ఎ గనికి చెందిన సింగరేణి ఉద్యోగులు మానవత్వం చాటారు. గని ఉద్యోగి అయిన బైండ్ల మహేష్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. దీంతో పాటు ఉద్యోగులందరూ కలిసి రూ.50 వేలు పోగు చేశారు. మృతుడి సతీమణికి రూ. 50 వేలు ఏఐటీయూసీ యూనియన్ పిట్ సెక్రటరీ మురళి చౌదరి, డిప్యూటీ మేనేజర్ అనిల్ సింగ్, మున్ని గాజుల ప్రభాకర్ గారి చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆడెపు సురేష్, గాజుల కార్తీక్, బేతి మల్లేష్, చక్రి, శ్రీనివాస్, రవి వర్మ, తాటి శ్రీనివాస్, రాజ్ కుమార్, + నరేష్ కుమార్, గండు శ్రీకాంత్, రాజయ్య మరియు తదితరులు పాల్గొన్నారు.

## రూ.2 లక్షల లంచం..

# ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన ఎక్సైజ్ సీఐ

**కామారెడ్డి ఏప్రిల్ 17(నినాదం):**



కామారెడ్డి జిల్లాలో ఓ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. బిచ్కుంద ఎక్సైజ్ సీఐగా పనిచేస్తున్న దీను సత్యనారాయణ రూ. 2 లక్షలు లంచం తీసుకుంటుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే... ఓ వ్యక్తి తన కల్లు దుకాణాన్ని మరో గ్రామానికి మార్చుకోవడానికి అనుమతి కోరాడు. అదే సమయంలో తనపై ఎలాంటి కేసులు నమోదు చేయవద్దని కూడా విజ్ఞప్తి చేశాడు. ఈ పని చేసిపెట్టడానికి సీఐ సత్యనారాయణ బాధితుడి నుంచి లంచం డిమాండ్ చేశాడు. దీంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. బిచ్కుందలోని సీఐ అద్దె ఇంట్లో బాధితుడి నుంచి రూ. 2 లక్షలు తీసుకుంటుండగా అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సీఐ వద్ద అదనంగా లభించిన రూ. 45,670 నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. సత్యనారాయణపై కేసు నమోదు చేసి, హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు.

# మెగా ఫ్యామిలీపై వ్యాఖ్యలు..

## స్టాండప్ కమెడియన్‌పై తెలంగాణ డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు

**హైదరాబాద్, ఏప్రిల్ 17 (నినాదం):**



స్టాండప్ కామెడీ పేరుతో మెగా ఫ్యామిలీ సభ్యులపై వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారంటూ కమెడియన్ అనుదీప్ కటికలపై అఖిల భారత చిరంజీవి యువత తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై వెంటనే స్పందించిన ఆయన, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం వన్ కల్యాణ్, నటుడు రామ్ చరణ్ గారు, నిర్మాత, నటి నిహారిక వ్యక్తిగత జీవితాలను కించపరిచేలా అనుదీప్ కటికల వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్టాండప్ కామెడీ ముసుగులో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సరికాదని అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వామినాయుడు, తెలంగాణ చిరంజీవి యువత అధ్యక్షుడు వెల్పుల వెంకటేశ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "మెగా ఫ్యామిలీపై వ్యక్తిగత దూషణలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు" అని హెచ్చరించారు.

# పవన్ కల్యాణ్‌పై వివాదాస్పద వ్యాఖ్యల కలకలం

- మరో స్టాండప్ కమెడియన్ రఫీక్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు
- బెయిల్‌పై విడుదలైన కమెడియన్ అనుదీప్ కటికాల
- వ్యక్తిగత విమర్శల వెనుక రాజకీయ కుట్ర ఉందన్న అనుమానాలు

**అమరావతి, ఏప్రిల్ 17 (నినాదం) :**



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత విమర్శలకు దిగిన ఇద్దరు స్టాండప్ కమెడియన్లపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే అనుదీప్ కటికల అనే కమెడియన్‌ను అరెస్ట్ చేయగా, తాజాగా విశాఖపట్నంకు చెందిన మరో కమెడియన్ రఫీక్ మొహమ్మద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హాస్యం పేరుతో సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఈ ఘటనలు తీవ్ర చర్చకు దారితీశాయి. గత కొంతకాలంగా పవన్ వైవాహిక జీవితం, ఆయన కుటుంబ సభ్యులను కించపరిచేలా కొందరు సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. ఈ క్రమంలో పవన్ కల్యాణ్‌తో పాటు రామ్ చరణ్, ఉపాసన, నారా లోకేశ్, నందమూరి బాలకృష్ణలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనుదీప్ కటికలను కాకినాడ పోలీసులు ఉత్తరప్రదేశ్‌లో అరెస్ట్ చేశారు. ఈ ఘటన మరువక ముందే రఫీక్ మొహమ్మద్ అనే కమెడియన్ గతంలో చేసిన వీడియోలు వెలుగులోకి వచ్చాయి. పవన్ ముగ్గురు భార్యల గురించి, ముఖ్యంగా ఆయన భార్య అన్నా లెజినోవా గురించి రఫీక్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆగ్రహానికి కారణమయ్యాయి. ఈ వ్యాఖ్యలు సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని జనసేన నేత సాయన శివనారాయణ మచిలీపట్నంలోని చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం రాత్రి విశాఖపట్నంలోని రఫీక్ నివాసానికి వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. పవన్ కల్యాణ్ ఇప్పుడు కేవలం సినీ నటుడు మాత్రమే కాదు, రాష్ట్ర డిప్యూటీ సీఎంగా కీలక హోదాలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే రాజకీయ ప్రత్యర్థుల ప్రోద్బలంతోనే ఈ కమెడియన్లు వరుసగా దాడులకు దిగుతున్నారని కూటమి మద్దతుదారులు ఆరోపిస్తున్నారు.

నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
శుక్రవారం ఏప్రిల్ 17 2026
ninadam.in
EVENING 6 PM
డిజిటల్ ఎడిషన్






# ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు బాంబు బెదిరింపు

**హైదరాబాద్ ఏప్రిల్ 17 (నినాదం) :**
హైదరాబాద్ నగరంలోని ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు బాంబు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. మెట్రో స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మెట్రో రైలు స్టేషన్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అనుమానాస్పద వస్తువులు ఏవీ లభించకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. మెట్రో రైలు స్టేషన్‌లో ఎలాంటి బాంబు లభ్యం కాలేదని పోలీసులు వెల్లడించారు. ఫోన్ చేసిన నెంబర్ ఆధారంగా ఆ వ్యక్తి ఎవరో ఆరా తీసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

# తెలంగాణపై అజ్ఞానంతో మాట్లాడతారా?

## - తేజస్వి సూర్యపై కోదండరాం నిప్పులు

- తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిచేలా తేజస్వి సూర్య వ్యాఖ్యానించారన్న కోదండరాం
- తెలంగాణ ఏర్పాటును బ్రిటీష్ కాలం నాటి పరిస్థితులతో ముడిపెట్టడం శోచనీయమని మండిపాటు
- ఎంపీ బాధ్యతారహితంగా మాట్లాడుతుంటే కేంద్ర మంత్రులు మౌనంగా ఉన్నారని విమర్శ



**హైదరాబాద్, ఏప్రిల్ 17 (నినాదం):**
తెలంగాణ అస్తిత్వాన్ని, అమరుల త్యాగాలను కించపరిచేలా బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలు చేశారని తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏమాత్రం సందర్భం లేకుండా, కనీస అవగాహన లేకుండా తెలంగాణ ఏర్పాటును బ్రిటిష్ కాలం నాటి పరిస్థితులతో ముడిపెట్టడం శోచనీయమని మండిపడ్డారు. రాజ్యాంగంలోని ఆర్టికల్-3 ప్రకారం, అత్యున్నత ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఏర్పాటైన రాష్ట్రాన్ని కించపరచడం అంటే భారత రాజ్యాంగాన్ని అవమానించడమేనని అన్నారు. తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షను నాటి బీజేపీ అగ్రనేతలు సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ గౌరవించి, మద్దతు తెలిపిన విషయాన్ని కోదండరాం ఈ సందర్భంగా గుర్తు చేశారు. సొంత పార్టీ సీనియర్ నేతలు తీసుకున్న నిర్ణయాలను కూడా అర్థం చేసుకోకుండా తేజస్వి సూర్య మాట్లాడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ అంత బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతుంటే పక్కనే ఉన్న కేంద్ర మంత్రులు ఆయన్ని నిలువరించకపోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు ఈ వ్యాఖ్యలను ఖండించకపోవడాన్ని బట్టి చూస్తే, వారికి రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమని అర్థమవుతోందని విమర్శించారు. తేజస్వి వ్యాఖ్యలను తక్షణమే పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించాలని, ఆయనపై బీజేపీ అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య కాల్పుల విరమణ..

- ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ
- ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో హెజ్బొల్లాపై దాడుల నిలిపివేత
- దశాబ్దాల తర్వాత అమెరికా మధ్యవర్తిత్వంతో ఇరు దేశాల చర్చలు
- దక్షిణ లెబనాన్‌లో 642 మంది భారత శాంతి సైనికులు




**వాషింగ్టన్, ఏప్రిల్ 17 (నినాదం):**
ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య 10 రోజుల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించారు. ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరు దేశాల సరిహద్దుల్లో పెరిగిన ఘర్షణలను తాత్కాలికంగా చల్లార్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. వాషింగ్టన్ కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం 5 గంటల నుంచి ఈ ఒప్పందం అమల్లోకి వచ్చింది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ అవున్‌లతో తాను మాట్లాడిన తర్వాతే ఈ అంగీకారం కుదిరిందని ఆయన వివరించారు. ఇరాన్ మద్దతున్న హెజ్బొల్లా మిలిటెంట్ సంస్థను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులు తీవ్రతరం చేయడంతో లెబనాన్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఈ కాల్పుల విరమణతో ఇజ్రాయెల్ తన దాడులను నిలిపివేయనుంది. లెబనాన్ నుంచి హెజ్బొల్లా కూడా దాడులు జరపకుండా సంయమనం పాటిస్తేనే ఈ ఒప్పందం నిలబడుతుంది. ఈ ఒప్పందానికి ముందు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ రాయబారులు వాషింగ్టన్‌లో సమావేశమయ్యారు. 1980ల తర్వాత ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష చర్చలు జరగడం ఇదే తొలిసారి. లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇప్పటివరకు 2,000 మందికి పైగా మరణించగా, పది లక్షల మందికి పైగా నిరాశ్రయులయ్యారు. కాగా, దక్షిణ లెబనాన్‌లో ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళంలో 642 మంది భారత సైనికులు కూడా సేవలందిస్తున్నారు. ఈ కాల్పుల విరమణను ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ స్వాగతించారు. ఇరు దేశాల మధ్య శాశ్వత శాంతి కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఇండోనేషియా అడవుల్లో కుప్పకూలిన హెలికాప్టర్..

## - 8 మంది దుర్మరణం

- టేకాఫ్ అయిన 5 నిమిషాలకే తెగిపోయిన కాంటాక్ట్
- దట్టమైన అటవీ ప్రాంతంలో శకలాల గుర్తింపు
- మృతుల్లో ఇద్దరు సిబ్బంది, ఆరుగురు ప్రయాణికులు

**ఢిల్లీ, ఏప్రిల్ 17 (నినాదం):**



ఇండోనేషియాలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకుంది. వెస్ట్ కాలిమంతన్ ప్రావిన్స్‌లో జరిగిన ఈ దుర్ఘటనలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది మృతి చెందారు. దట్టమైన అటవీ ప్రాంతంలోని కొండల మధ్య హెలికాప్టర్ శకలాలను అధికారులు గుర్తించారు. జిన్హువా వార్తా సంస్థ కథనం ప్రకారం మెలావీలోని ఒక ప్లాంటేషన్ ఏరియా నుంచి టేకాఫ్ అయిన కేవలం ఐదు నిమిషాలకే ఎయిర్‌బస్ హెచ్130 హెలికాప్టర్‌తో సంబంధాలు తెగిపోయాయి. అనంతరం గాలింపు చర్యలు చేపట్టగా, గురువారం మధ్యాహ్నం 3:25 గంటల సమయంలో ఇండోనేషియా వైమానిక దళానికి చెందిన సూపర్ ప్యూమా హెలికాప్టర్ మొదట శకలాలను గుర్తించింది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో ఇద్దరు సిబ్బంది, ఆరుగురు ప్రయాణికులు ఉన్నారు. సహాయక బృందాలు ఇప్పటివరకు నాలుగు మృతదేహాలను వెలికితీశాయి. మరో మూడు మృతదేహాలు శకలాల్లోనే చిక్కుకోగా, మరొకరి కోసం గాలింపు కొనసాగుతోంది. చీకటి పడటం, భూభాగం అత్యంత కఠినంగా ఉండటంతో సహాయక చర్యలను తాత్కాలికంగా నిలిపివేశారు. శుక్రవారం ఉదయం తిరిగి ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. రాయిటర్స్ నివేదిక ప్రకారం ఈ హెలికాప్టర్ మాథ్యూ ఎయిర్ నుసంతారాకు చెందినది. చిత్ర మహకోట అనే పామాయిల్ కంపెనీకి చెందిన ప్లాంటేషన్ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది.

# తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చిన తేజస్వి సూర్య

- వెంకయ్య నాయుడు, కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలి: సీపీఐ నారాయణ
- రాష్ట్ర విభజన బిల్లు ఆమోదం పొందినప్పుడు వెంకయ్య నాయుడు, సుష్మ వంటి వారు మద్దతు తెలిపారన్న నారాయణ
- ఆనాడు బీజేపీ నేతలు తీసుకున్న నిర్ణయం తప్పని తేజస్వి భావిస్తున్నారా? అని ప్రశ్న



**హైదరాబాద్, ఏప్రిల్ 17 (నినాదం):**
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంట్ సాక్షిగా జరిగిన ఈ పరిణామంపై ఆయన నిప్పులు చెరిగారు. ఆనాడు విభజన బిల్లు ఆమోదం పొందినప్పుడు బీజేపీ తరపున సుష్మా స్వరాజ్, వెంకయ్య నాయుడు వంటి అగ్రనేతలు మద్దతు తెలిపిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తేజస్వి సూర్య చేసిన ఈ వివాదాస్పద వ్యాఖ్యలకు వెంకయ్య నాయుడు, కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అసలు ఆనాడు బీజేపీ నేతలు తీసుకున్న నిర్ణయం తప్పని తేజస్వి భావిస్తున్నారా? అని ప్రశ్నించారు. ఇదే క్రమంలో ప్రధాని మోదీ అనుసరిస్తున్న రాజకీయాలపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. మోదీ సర్కార్ 'నీతి లేని రాజకీయాలు' చేస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది 'పాయసంలో విషం కలిపి తాగమన్నట్లుగా' ఉందని ఎద్దేవా చేశారు. మహిళా రిజర్వేషన్లు న్యాయమైనవని, వాటిని నేరుగా అమలు చేయకుండా డీలిమిటేషన్ పేరుతో కాలయాపన చేయడం మహిళలను బ్లాక్ మెయిల్ చేయడమేనని మండిపడ్డారు. ఈ డీలిమిటేషన్ ప్రక్రియ భవిష్యత్తులో దేశాన్ని ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించే ప్రమాదం ఉందన్న ఆందోళనను కూడా ఆయన వ్యక్తం చేశారు.



# ఇక డయాలసిస్ కోసం దూరం వెళ్లక్కర్లేదు..

## తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం

- తెలంగాణలో కొత్తగా 79 దయాలసిస్ కేంద్రాల ఏర్పాటు
- కిడ్నీ రోగులకు అందుబాటులోకి మెరుగైన వైద్య సేవలు
- పీపీపీ పద్ధతిలో 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌లో నిర్వహణ
- మారుమూల, గిరిజన ప్రాంతాలకు ప్రాధాన్యత

**హైదరాబాద్, ఏప్రిల్ 17 (నినాదం):**
తెలంగాణలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారికి మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 79 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. మారుమూల ప్రాంతాల్లోని రోగులు డయాలసిస్ కోసం పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త కేంద్రాలను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌లో నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులు ప్రధాన హబ్‌లుగా వ్యవహరిస్తూ, మిగిలిన కేంద్రాలకు సాంకేతిక మార్గదర్శకత్వం అందిస్తాయి. కొత్త కేంద్రాలతో పాటు ఇప్పటికే ఉన్న 67 డయాలసిస్ సెంటర్లలో అదనంగా 155 యంత్రాలను ఏర్పాటు చేసి పడకల సామర్థ్యాన్ని కూడా పెంచనున్నారు. ప్రతి 25 కిలోమీటర్ల పరిధిలోను ఒక డయాలసిస్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ ఆలోచన. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఆసిఫాబాద్ వంటి ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కొత్త కేంద్రాల ద్వారా మొత్తం 416 పడకలు అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో కేంద్రంలో 5 నుంచి 10 డయాలసిస్ యంత్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ నిర్ణయంతో కిడ్నీ రోగులు చికిత్స కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. అత్యవసర సమయాల్లోనూ వేగంగా వైద్యం అందే అవకాశం కలుగుతుంది. ఈ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన టెండర్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎంఎస్ఐడీసీ) అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

# బీహార్ కొత్త సీఎం సామ్రాట్ చౌదరికి హత్యా బెదిరింపులు..

## - గుజరాత్‌లో నిందితుడి అరెస్ట్

- సామ్రాట్ చౌదరికి హత్యా బెదిరింపులతో కలకలం
- నిందితుడు గుజరాత్‌లో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు
- ట్రాన్సిట్ రిమాండ్‌పై బీహార్‌కు తరలిస్తున్న అధికారులు



**పాట్నా ఏప్రిల్ 17 (నినాదం) :**
బీహార్ నూతన ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరికి ఫోన్ ద్వారా హత్యా బెదిరింపులు రావడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొన్ని రోజులకే ఈ పరిణామం ఎదురుకావడంతో పోలీసు యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. నిందితుడిని పట్టుకునేందుకు రంగంలోకి దిగిన ముంగేర్ పోలీసుల ప్రత్యేక బృందం, సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఫోన్ నెంబర్‌ను ట్రేస్ చేసి.. అతడు గుజరాత్‌లో ఉన్నట్లు గుర్తించారు. గుజరాత్‌లోని సనంద్ ప్రాంతంలో తలదాచుకున్న శేఖర్ యాదవ్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అతడిని ట్రాన్సిట్ రిమాండ్‌పై బీహార్‌కు తరలిస్తున్నారు. అసలు ఒక ముఖ్యమంత్రిని చంపేస్తానని బెదిరించడానికి గల కారణాలేంటి? దీని వెనుక ఎవరి ప్రమేయమైనా ఉందా? అన్న కోణంలో పోలీసులు విచారణను ముమ్మరం చేశారు. మరోవైపు, బీహార్ రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. సుదీర్ఘ కాలం తర్వాత బీహార్‌లో తొలిసారిగా బీజేపీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడటం గమనార్హం. నితీశ్ కుమార్ రాజ్యసభకు వెళ్లడంతో, ఆ స్థానాన్ని భర్తీ చేస్తూ సామ్రాట్ చౌదరి ముఖ్యమంత్రిగా పీఠం అధిష్ఠించారు. ఈ కొత్త ప్రభుత్వంలో అధికార విభజన కూడా ఆసక్తికరంగా ఉంది. ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి ఏకంగా 29 శాఖలను తన వద్దే ఉంచుకోగా, మిత్రపక్షం జేడీయూ నుంచి ఇద్దరు నేతలు ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. జేడీయూకు మొత్తం 18 శాఖలను కేటాయించారు.



# బీబీసీలో ఉద్యోగాల కోత..

# 2000 మందిపై వేటుకు రంగం సిద్ధం

- ఖర్చుల తగ్గింపు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం
- ఓటీటీల నుంచి పోటీ, తగ్గుతున్న ఆదాయం ప్రధాన కారణం

**ఢిల్లీ, ఏప్రిల్ 17 (నినాదం):**
ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసీ) భారీ ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. ఖర్చులను తగ్గించుకునే ప్రణాళికలో భాగంగా దాదాపు 2,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. గత 15 ఏళ్లలో బీబీసీలో ఇదే అతిపెద్ద లేఆఫ్స్ కావడం గమనార్హం. సంస్థ మొత్తం 21,500 మంది సిబ్బందిలో దాదాపు 10 శాతం మందిపై ఈ నిర్ణయం ప్రభావం చూపనుంది. బుధవారం జరిగిన ఆల్-స్టాఫ్ మీటింగ్‌లో ఉద్యోగులకు ఈ విషయం తెలిపారు. వచ్చే నెలలో మాట్ బ్రిట్టిన్ కొత్త డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు చేపట్టనున్న తరుణంలో ఈ భారీ తొలగింపులు చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. 600 మిలియన్ పౌండ్ల (దాదాపు రూ. 7,535 కోట్లు) ఆదా ప్రణాళికలో భాగంగా ఈ ఉద్యోగాల కోతను ప్రకటించారు. మారుతున్న మీడియా రంగానికి అనుగుణంగా సంస్థను పునర్వ్యవస్థీకరించడమే లక్ష్యమని బీబీసీ పేర్కొంది. ప్రస్తుతం బీబీసీ తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. లైసెన్స్ ఫీజు ద్వారా ప్రధానంగా ఆదాయం పొందుతున్న బీబీసీకి.. నెట్‌ఫ్లిక్స్, డిస్నీ వంటి స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. దీనికి తోడు, లైసెన్స్ ఫీజు చెల్లించే వారి సంఖ్య కూడా గత ఏడాదితో పోలిస్తే సుమారు 3 లక్షలు తగ్గింది. వీక్షకుల అభిరుచులు మారడం కూడా సంస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ స్థాయిలో ఉద్యోగాలను తొలగించడం వల్ల సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి పడుతుందని, ఇది సంస్థ సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని కార్మిక సంఘాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ అంశాలపై బీబీసీ కవరేజీపై విమర్శలు రావడంతో గత డైరెక్టర్ జనరల్ టిమ్ డేవీ ఇటీవలే తన పదవి నుంచి తప్పుకున్నారు. ప్రస్తుతం తాత్కాలిక డైరెక్టర్ జనరల్ పర్యవేక్షణలో కార్యకలాపాలు సాగుతున్నాయి.

# రామాయణంపై సంచలన వ్యాఖ్యలు.. వివాదంలో నటుడు ప్రకాశ్ రాజ్

- రాముడు ఉత్తరాదివాడని, రావణుడు దక్షిణాది గిరిజనుడని వ్యాఖ్య
- దేశంలో మారణహోమానికి సన్నాహాలు జరుగుతున్నాయని ఆరోపణ
- ఆయన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర ఆగ్రహం
- ప్రకాశ్ రాజ్ పై క్రిమినల్ కేసు నమోదైనట్లు వార్తలు

**హైదరాబాద్, ఏప్రిల్ 17 (నినాదం):**
విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ మరోసారి తన వ్యాఖ్యలతో తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. ఇటీవల ఓ మీడియా కార్యక్రమంలో ఆయన రామాయణంతో పాటు దేశంలోని ప్రస్తుత పరిస్థితులపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యల కారణంగా ఆయనపై క్రిమినల్ కేసు కూడా నమోదైనట్లు వార్తలు వస్తున్నాయి.



అసలేం జరిగిందంటే..!
ఇటీవల జరిగిన ఓ మీడియా కాంక్లేవ్‌లో ప్రకాశ్ రాజ్ మాట్లాడుతూ.. శ్రీరాముడు ఉత్తర భారతదేశానికి చెందినవాడని, రావణుడు దక్షిణ భారతదేశానికి చెందిన గిరిజనుడని వ్యాఖ్యానించారు. పండ్లు దొంగిలించడం వల్లే వారి మధ్య ఘర్షణ మొదలైందని ఆయన పేర్కొనడం తీవ్ర విమర్శలకు దారితీసింది. హిందువులు అత్యంత పవిత్రంగా భావించే రామాయణం, శ్రీరాముడిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం పట్ల సోషల్ మీడియాలో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతటితో ఆగకుండా దేశంలో మత సామరస్యంపైనా ప్రకాశ్ రాజ్ సంచలన ఆరోపణలు చేశారు. "ఈ దేశంలో జరుగుతున్నది మారణహోమానికి సన్నాహం. వారు ముస్లింలను, గిరిజనులను, మైనార్టీలను పూర్తిగా తుడిచిపెట్టాలనుకుంటున్నారు" అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా కూడా పెద్ద చర్చకు దారితీశాయి. గతంలో కూడా ప్రకాశ్ రాజ్ పలుమార్లు బీజేపీ ప్రభుత్వ విధానాలను బహిరంగంగా విమర్శిస్తూ వార్తల్లో నిలిచారు. అయితే, ఈసారి మత విశ్వాసాలకు సంబంధించిన సున్నితమైన అంశాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాన్ని మరింత పెద్దది చేశాయి. ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యల అనంతరం ఆయనపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఆయనపై క్రిమినల్ అభియోగాలతో పోలీస్ కేసు నమోదైనట్లు సమాచారం. ఈ కేసులో ఆయన న్యాయపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ప్రకాశ్ రాజ్ నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు.